అ'పూర్వ'ం.. ఆత్మీయం


మంచిర్యాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తరగతి గదిలో పాఠాలు నేర్చుకుని వ్యాపారాలు, ఉద్యోగాల కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఆదివారం పాఠశాలల ఆవరణలో కలుసుకున్నారు. అపూర్వ సమ్మేళనాలతో ఒకచోటుకు చేరారు. గురువులను ఆహ్వానించి శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కుటుంబాల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. మంచిర్యాల పట్టణంలోని అభినవ విద్యానదన్ పాఠశాలలో 1999- 2000 బ్యాచ్, తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999- 2000 బ్యాచ్, భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000- 2001 బ్యాచ్, హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005- 06 బ్యాచ్, మందమర్రి మండలంలోని పొన్నారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2006- 07 బ్యాచ్ విద్యార్థులు ఆయా పాఠశాలల ఆవరణల్లో ఒకే వేదికపై కలుసుకున్నారు. ముచ్చట్లలో మునిగిపోయి ఆనంద క్షణాలు పంచుకున్నారు.

– మందమర్రిరూరల్/భీమారం/మంచిర్యాలటౌన్/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)


ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...


పొన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో...


తాండూర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


భీమారం జెడ్పీ పాఠశాలలో...

క్లుప్తంగా

కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భీమారం: రాష్ట్రవ్యాప్తంగా లంబాడాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 8న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకి పెద్ద ఎత్తున తరలిరావాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ కోరారు. మండలంలోని బూర్గుపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల గణనలో లంబాడాల జనాభాని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం గోర్ బోలి భాషను అధికారికంగా గుర్తించి 8వ షెడ్యూల్లో చేర్చాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యలను శ్వాశతంగా పరిష్కరించి, పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, జిల్లా అధ్యక్షుడు బుక్యా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం


సన్మానిస్తున్న మీ సేవ నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ పదవీ విరమణ సందర్భంగా జిల్లాలోని మీ సేవ నిర్వాహకులు శాలువ కప్పి సన్మానం చేసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేశారు.

చదువులో ప్రపంచంతో పోటీ పడాలి


అశ్రిత్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: ప్రపంచంతో పోటీ పడేవిధంగా విద్యార్థులు చదువుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం జేఈఈ పరీక్షలో సత్తా చాటి సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకుంటున్న కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన తీగల అశ్రిత్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి ల్యాప్‌టాప్ అందజేశారు. ఎల్లప్పుడు విద్యార్థు లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, కాసిపేట మండల కార్యదర్శి ఆర్.ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, అశ్రిత్ తల్లిదండ్రులు తీగల సుజాత, శ్రీనివాసరావు, స్థానిక నాయకుడు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మునీర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు, జర్నలిస్టులు

కాసిపేట: తెలంగాణ ఉద్యమ కారుడు, సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రజా సంఘాలు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిలోజు మురళి, రవీందర్, మాజీ జెడ్పీటీసీ సత్తయ్య, సిరాజ్‌ఖాన్, వాసుదేవ్, చిన్న భీమయ్య, రాజయ్య, జర్నలిస్టులు ఉన్నారు.

పక్కా భవనాలు లేక పరేషాన్

- గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు కరువు
- కొత్త మండలం 'భీమారం'లో పాలన ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



వీఎస్ఎస్ భవనంలో నిర్వహిస్తున్న పోలంపల్లి జీపీ కార్యాలయం

భీమారం: ప్రజలవద్దకే పాలన అనే నినాదంతో గ్రామాల్లో గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ లక్ష్యం మంచిదైనా వాటి నిర్వహణ కోసం భవనాలు నిర్మించకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భీమారం మండలంలో మొత్తం 11పంచాయతీ కార్యాలయాలు ఉండగా అందులో కేవలం మూడింటికే సొంత భవనాలు ఉండటం విశేషం. జైపూర్ ఉమ్మడి మండలంలో ఉన్న భీమారంను 2016లో అప్పటి సీఎం కేసీఆర్ కేవలం 7పంచాయతీలతో కొత్తగా భీమారం మండలాన్ని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వం కొత్త పంచాయితీలను ఏర్పాటు చేయగా మండలంలో మరో నాలుగు కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. కానీ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకుండా గ్రామాల్లో అందుబాటులో ఉన్న పాఠశాల భవనాల్లో జీపీ కార్యాలయాలు ప్రారంభించి చేతులు దులుపేసుకుంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయాల్లోనే 5ఏళ్ల నుంచి పాలన కొనసాగిస్తున్నారు.

మండల కేంద్రంలో దాత నిర్మించిందే..

భీమారం మండల కేంద్రంలో దాదాపు 60ఏళ్ల క్రితం నిర్మించిన జీపీ సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో, అదే గ్రామానికి చెందిన చెర్కు సరోత్తం రెడ్డి అనే దాత ముందుకొచ్చి గ్రామపంచాయతీకి భవనం నిర్మించి ఇచ్చారు. ఆరేళ్ల నుంచి అందులోనే జీపీ కార్యాలయంతోపాటు మండల పరిషత్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వమే సొంత భవనం నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు...

జీపీల పెంపుదలతో ఎంతో సంతోషపడ్డ వివిధ గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా సొంత భవనాలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు దూరంగా నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాల్లో ప్రస్తుతం కాజిపల్లి, నర్సింగాపూర్, ధర్మారం, దాంపూర్, ఆరెపల్లి, గ్రామపంచాయతీలు నిర్వహిస్తుండగా, ఎలకేశ్వరంలో అద్దె భవనం, పోలంపల్లిలో వీఎస్ఎస్ భవనంలో జీపీ కార్యాలయాలను నడుపుతున్నారు. పోలంపల్లిలో జీపీ నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థలకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంటిపన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్న ప్రభుత్వం, ఉపయోగపడేవిధంగా జీపీ భవనాలు ఎందుకు నిర్మించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొత్తపల్లిలో అర్ధంతరంగా నిలిచిన పనులు...

మండలంలోని కొత్తపల్లి (పాతపంచాయతీ)కి పన్నెండేళ్ల క్రితం జీపీ భవనం పనులు చేపట్టి మధ్యలోనే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో అప్పటివరకు ఆ భవనంపై పెట్టిన నిధులు వృథాగా మారాయి.

నిర్మాణాలపై ఎందుకు నిర్లక్ష్యం?

గ్రామపంచాయతీలను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటి అభివృద్ధి కోసం ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు వచ్చే అధికారులతో పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాలన సాగించేందుకు విశాలమైన భవనాలు ఉంటే ఎంతో బాగుండేదని అంటున్నారు. వదిలిపెట్టిన పాఠశాల భవనాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేతులు దులుపేసుకుందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా మండలంలో భవనాలు లేని గ్రామపంచాయతీలను గుర్తించి కొత్తగా భవనాలు నిర్మించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

తక్షణమే నిర్మించాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో నూతన గ్రామపంచాయతీ భవనాలు నిర్మించాలి. నేడు భవనాలు లేక పాతపడ్డ భవనాల్లో పాలన కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలి. – పెద్దల బాపు, మాజీ సర్పంచ్, నర్సింగాపూర్

కూలిపోతుంది



పోలంపల్లి గ్రామ పంచాయతీ ఏర్పడి అనేక సంవత్సరాలు అయినప్పటికీ, ఇప్పటికీ సొంత భవనం లేదు. అటవీశాఖ వీఎస్ఎస్ ద్వారా నిర్మించిన కమ్యూనిటీ హాల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. అది కూడా కూలిపోయే దశకు చేరుకుంది. ప్రభుత్వం కొత్త భవనం నిర్మించాలి.

– దర్శనాల మధూకర్, పోలంపల్లి

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో పంచాయతీ భవనాలు లేని గ్రామాలు గుర్తించి నూతన భవనాల కోసం ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. మండలంలో చాలా గ్రామాల్లో జీపీ భవనాలు లేవు. ఇబ్బంది ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. అయితే ప్రభుత్వం కొత్తవి మంజూరు చేస్తే పనులు ప్రారంభిస్తాం.

– మధుసూధన్, ఎంపీడీవో, భీమారం

ప్రజల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ



సభలో అభివాదం చేస్తున్న నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

రామకృష్ణాపూర్: ప్రజలపక్షాన నిలుస్తూ వారి సమస్యలు, హక్కులపై పోరాటాలు చేసే పార్టీ సీపీఐ మాత్రమే అని ఆ పార్టీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ పట్టణ 3వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్రం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని సూచించారు. అంతకుముందు పట్టణంలోని బీజోన్ రాజీవ్‌చౌక్ నుంచి సూపర్‌బజార్ వరకు ర్యాలీ తీశారు. పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ కార్యదర్శిగా మరోసారి మిట్టపెల్లి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, చంద్రశేఖర్, ఇప్పకాయల లింగయ్య, సుదర్శన్, వనం సత్యం, పాల్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: ఈ నెల 21, 22తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. శ్రీరాంపూర్ కృష్ణాకాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న నస్పూర్ మండల మహాసభ జరుగుతుందని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ వందేళ్లలో పేద ప్రజలకు, కార్మిక, కర్షక వర్గానికి అండగా నిలబడిందన్నారు. సీపీఐ పోరాటాలతోనే నేడు ప్రభుత్వాలు దిగివచ్చి అనేక ప్రజా సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల దాసు, నాయకులు లింగం రవి, కారుకూరి నగేష్, సంఘం సదానందం, చిలుక రామచందర్, మల్లికార్జున్, కొత్తపల్లి మహేష్ పాల్గొన్నారు.

'సులభ్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సులభ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇతర కార్మికులకు అమలు చేస్తున్నట్లు సులభ్ కార్మికులకు ఈఎస్ఐ, బోనస్, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 5న హెడ్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నాలో సులభ్ కార్మికులు పాల్గొనాలని కోరారు. నాయకులు మల్లేష్, వెంకటేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఏరియాలోని సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీ జియన్ అధ్యక్షుడు ఎండీ జాఫర్ ఆదివారం ఒ క ప్రకటనలో డిమాండ్ చేశారు. సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద అనేక సమస్యలు నెలకొన్నాయ ని, వాటిని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్తే పరి ష్కరించకపోగా ఉద్యోగం నుంచి తీసివేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద పనులు చేస్తున్న కార్మికులను ఇతర పనులకు పురమాయిస్తూ, డబ్బులు వసూలు చేస్తున్నారని సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకోవాలని కోరారు.

నగరం చెత్తమయం...!


మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయం వెనుక రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

లైబ్రరీకి, గాంధీ పార్కుకు పక్కనే రోడ్డుపై వేసిన చెత్త



అండర్ బ్రిడ్జికి వెళ్లే దారిలో...




మంచిర్యాలలోని హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్డుపై...


రైల్వేలైన్‌కు అడ్డుగా నిర్మించిన గోడ వద్ద...


వికాస్‌నగర్‌కు వెళ్లే దారిలో...

మంచిర్యాలటౌన్: గ్రామం నుంచి మొదలుకొని నగరాల వరకు సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకునేందుకు సిద్ధం అయ్యాయి. అన్ని పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం ఆదివారం మధ్యాహ్నం వరకు ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిచ్చాయి. పారిశుధ్య కార్మికులు ఆదివారం ఉదయం మాత్రమే విధులు నిర్వర్తించి వెళ్లిపోయారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఉన్న చెత్త కుప్పల మధ్యనే, ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జరుపుకోవాల్సి వస్తోంది. మంచిర్యాల మున్సిపాలిటీగా ఉన్నప్పుడు ఇంతగా చెత్త కుప్పలు కనిపించలేదని, కార్పొరేషన్‌గా మారిన తరువాత ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. కార్పొరేషన్‌గా మారితే మరిన్ని సేవలు మెరుగుపడాల్సింది పోయి, ఉన్న సేవలు కొనసాగకపోవడంతో, పాలకవర్గం ఉంటేనే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ప్రత్యేక అధికారుల పాలనలో నగరం పరిశుభ్రంగా ఉండాల్సింది పోయి, చెత్తమయంగా మారడం, రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఎలా జరుపుకోవాలనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. ప్రతీరోజు కాకపోయినా, రెండు నుంచి మూడు రోజులకు ఒకసారైనా చెత్త తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

• రసాబాసగా 'పెయింటర్స్ అండ్ వర్కర్స్' ఎన్నికలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మంచిర్యాల ఏరియా పెయింటర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు కార్మికులు ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ఓటమి వర్గం వారు గెలిచిన వారిపై ఆరోపణలు చేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని, తిరిగి ఎన్నిక నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

• వృద్ధులకు అన్నదానం

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆర్కే-5 కాలనీ శ్రీ సాయి అనాథ వృద్ధాశ్రమంలో గజెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు గజెల్లి రాజలింగు మాట్లాడుతూ.. గోదారోళ్ల కితకితలు సృష్టికర్త ఈవీ సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రావణ్, కిరణ్, శ్యామ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

• రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

దండేపల్లి: రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామ రేషన్ డీలర్ మోటపల్కుల సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అతడిని గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.

• పెట్రోల్ బంక్ ప్రారంభం

కాసిపేట: బెల్లంపల్లి, సోమగూడెం గ్రామాల మధ్య మధుర జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఓ పెట్రోల్ బంక్‌ను ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

• క్రికెట్ అకాడమీ ప్రారంభం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో క్రికెట్ అకాడమీని సెవెన్ హిల్స్ పాఠశాల డైరెక్టర్ గోనే భాగ్యలక్ష్మి ఆదివారం పారంభించారు. క్రికెట్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. అకాడమీలో 5ఏళ్ల నుంచి 25ఏళ్ల వయస్సు వారికి క్రికెట్‌లో శిక్షణ ఇచ్చి, ఆటలో నిష్ణాతులను తయారు చేయడమే లక్ష్యమన్నారు.